ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 1 సెప్టెంబరు 2024





ఇసుక ర్యాంప్‌లోకి వెళ్లకుండా రెవెన్యూ అధికారులు వేసిన ట్రెంచ్



గూనభద్ర వద్ద ఇసుక రవాణా కోసం నిలిపిన లారీలు

ఒడిశా బిల్లు.. ఆంధ్రా ఇసుక

- లారీ సరుకు కేవలం రూ.30 వేలు మాత్రమే
- ప్రభుత్వం హెచ్చరిస్తున్నా.. మారని నేతల తీరు
- అక్రమ తరలింపు గుట్టురట్టు చేసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ కొత్తూరు, ఆగస్టు 31: కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టింది.. ఇసుకను యథేచ్ఛగా తరలించుకుపోయేందుకు అన్నట్లుగా కొందరు నేతలు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు.. జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో మాట్లాడి అక్రమాలకు పాల్పడవద్దని.. హెచ్చరిస్తూనే ఉన్నారు. కిందిస్థాయి కార్యకర్తలు, నాయకులు సైతం ప్రభుత్వానికి అప్రతిష్ఠ తేవద్దని.. నిజాయితీగా పాలన అందించాలని ఆదేశిస్తూనే ఉన్నారు. కానీ కొంతమంది నాయకులు మాత్రం ఈ విషయాన్ని తమకు వర్తించదు అన్నట్లుగా వదిలేస్తున్నారు. ముఖ్యంగా నదుల్లో ఇసుకను తరలించేందుకు అనుమతి ఇచ్చేదీ తామే.. తరలించుకుపోయేందుకు ఆదేశాలు ఇచ్చేది తామే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితి పాతపట్నం నియోజకవర్గంలో చోటుచేసుకుంది. ఇక్కడ ఇసుక అక్రమ తవ్వకాలు భాగోతం మరోసారి బయటపడింది. ఒడిశా నుంచి బిల్లుల తీసుకువచ్చి.. దర్జాగా ఇసుకను ఇక్కడ (ఆంధ్రా) నుంచి తరలించుకుపోతు న్నారు. ఎవరి సహకారం లేకుండా.. పక్క రాష్ట్రానికి చెందిన వారు ఇక్కడకు వచ్చి ఇసుకను తరలించుకుపోవడం.. అదీ లారీ ఇసుకను రూ.30వేలకు విక్రయించుకోవడమంటే.. స్థానిక ప్రజలే కాదు.. ఎవరూ నమ్మేపరిస్థితి లేదు. అయితే కొద్దిరోజులు గా పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం ఆకుల తంపరలో ఇసుకను లారీలతో అక్రమంగా తరలిస్తున్న విషయం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణకు చేరింది. దర్జాగా ఇసుక తరలించుకు పోతున్నా.. అధికారులు కూడా అడ్డుచెప్పకపోవడం.. పైగా స్థానికుల ఇంటి నిర్మాణాలకు కాకుండా.. ఒడిశా నుంచి భారీవాహనాలతో తరలిస్తున్నారంటూ గ్రామస్థులు వివరించారు. ఈ నేపథ్యంలో ఇసుక అక్రమ తరలింపుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు కలమట ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందన లేకపోవడంతో శనివారం వేకువజామున నేరుగా ఇసుక తరలింపు జరుగుతున్న ప్రాంతం వద్దకు గ్రామస్థులతో కలిసి కలమట వెంకటరమణ వెళ్లారు. శుక్రవారం రాత్రి వంశధార నదిలో నుంచి ఇసుక తవ్వకాలు జరిపి.. లారీల్లో నింపి గూనభద్ర వద్ద నిలిపివేసినట్టు తెలుసుకున్నారు. ఒక్కో లారీకి రూ. 30 వేలు చొప్పున వసూలు చేసి.. ఒడిశా బిల్లులను చూపి కొందరు ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. అనుమతులు లేకుండా తరలిస్తున్న నాలుగు ఇసుక లారీలను రామకృష్ణపురం వద్ద గ్రామస్థులు అడ్డుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం తీరుపై నిలదీశారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దని.. ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే ఎంతటివారిపైనా ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని కలమట హెచ్చరించారు. అక్కడ నుంచే కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి.. పాతపట్నం నియోజకవర్గంలో వంశధార నదిలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవా లని.. పటిష్ఠ నిఘా పెంచాలని కోరారు. అలాగే ఇసుకను తరలిస్తున్న లారీలను పోలీసులతో సీజ్ చేయించారు. ఈ నేపథ్యంలో ఇసుక అక్రమ రవాణా జరపకుండా.. ఆకులతంపరలో వంశధార నదికి వెళ్లకుండా అడ్డుగా రెవెన్యూ అధికారులు ట్రెంచ్ తవ్వారు. నాలుగు ఇసుక లారీలను కొత్తూరు ఎస్ఐ ఎం.ఏ.అహ్మద్ సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

● ఓంద్రుజోలలో పర్యటించిన పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలని తెలిపారు. ప్రభుత్వానికి అవినీతి మరక అంటించాలనుకుంటే ఉపేక్షించబోమని హెచ్చరించారు. అక్రమ రవాణాకు పాల్పడే వాహనాలను సీజ్ చేయాలని సూచించారు.



రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని నిలదీస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ

జోరువానలోనూ..

● జిల్లాలో 95.98 శాతం పింఛన్ల పంపిణీ

కలెక్టరేట్, ఆగస్టు 31: జిల్లాఅంతటా ఎడతెరిపి లేకుండా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అయినా సరే శనివారం చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా సాగింది. సెప్టెంబరు 1న ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే శనివారం పింఛన్ల పంపిణీ చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 3,16,883 మంది లబ్ధిదారులకుగాను 3,04,130 మందికి (95.98 శాతం) పింఛన్లను పంపిణీ చేశారు. మిగిలిన 12,753 మందికి సోమవారం పంపిణీ చేయనున్నారు. జిల్లాలో అత్యధికంగా శ్రీకాకుళం అర్బన్‌లో 97.34 శాతం, అత్యల్పంగా టెక్కలి, వజ్రపుకొత్తూరుల్లో 95.23 శాతం పంపిణీ చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా అరసవల్లి సచివాలయ పరిధిలోని పాతహౌసింగ్ బోర్డు కాలనీలో లబ్ధిదారులకు పింఛన్‌ను అందజేశారు.



రావివలసలో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పింఛన్ల అక్రమాలపై త్వరలో విచారణ

● వైసీపీ పాలనలో అనర్హులకే ప్రాధాన్యం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి, ఆగస్టు 31: 'వైసీపీ ప్రభుత్వ పాలనలో పింఛన్ల పంపిణీలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. అర్హులకన్నా.. అనర్హులకే ప్రాధాన్యమిచ్చారు. ఈ అక్రమాలపై త్వరలో విచారణ చేపడతామ'ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శనివారం టెక్కలి మండలం రావివలసలో గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను పరిశీలించారు. అనంతరం సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'వైసీపీ పాలన తీరుతో ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడింది. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పచ్చి మోసగాడు. ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడు' అని ఆరోపించారు. దెబ్బతిన్న అన్ని వ్యవస్థలనూ గాడిలో పెట్టే దిశగా తాము పాలన కొనసాగిస్తున్నామని వెల్లడించారు. 'గత ప్రభుత్వంలో వస్తాదులకు, బలవంతు లకు సైతం దివ్యాంగుల పింఛన్లు అందజేశారు. అర్హులను పక్కన పెట్టారు. కోటబొమ్మాళి మండలంలోని ఓ గ్రామంలో అధికారుల విచారణలో పింఛన్ల అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ప్రతిచోటా ఇటువంటి అక్రమాలు ఉన్నాయి. వీటిపై విచారణ చేపడతాం. అధికారులు, వైద్య బృందాలు నేరుగా గ్రామాల్లో పర్యటించి.. అనర్హుల దివ్యాంగ పింఛన్‌దారులను గుర్తిస్తారు. జాబితా నుంచి వారి పేర్లు తొలగిస్తాం. అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు.

● అభివృద్ధికి కృషి

రైతులకు రాజముద్రతో కొత్త పాస్‌పుస్తకాలు అందజేస్తాం. రైతుల్లో తగాదాల నేపథ్యంలో.. జగనన్న సర్వే రాళ్లను తొలగిస్తాం. 2014-19 మధ్య నిర్మించిన ఇళ్ల కాలనీలను పరిశీలించి.. బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించాం. రూ.140కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. మూలపేట పోర్టుకు సంబంధించిన లోపాలు సరిదిద్ది పనులు పూర్తిచేస్తాం. ఆ ప్రాంతంలో మినీ ఎయిర్‌పోర్టు, కోస్టల్ కారిడార్, ఆరులేన్ల రహదారికి కృషి చేస్తాం. త్వరలో నీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తాం. రావివలస ఎండలమల్లిఖార్జున స్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. మూతపడిన ఫెర్రోఎల్లాయిస్ కర్మాగారాన్ని తెరిపించేందుకు కృషి చేస్తాం. ఎన్ఎం రోడ్డు నుంచి దండుగోపాలపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తా'నని మంత్రి అచ్చెన్న హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో బి.సుదర్శన్ దొర, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జయరాజ్, పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాష్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, అగ్రికల్చర్ ఏడీ తిరుమలరావు, తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి, ఎంపీడీవో లక్ష్మీబాయి, డీఎల్‌పీవో ఐ.రమణ, టీడీపీ నేతలు కింజరాపు హరివరప్రసాద్, ఎల్.ఎల్.నాయుడు, బగాది శేషగిరిరావు, ఎంపీపీ ఆట్ల సరోజినమ్మ పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో రహదారులపై ప్రవహిస్తున్న వర్షపునీరు



గార: అంపోలు వద్ద కూలిన చెట్టు

విస్తారంగా వర్షాలు

● జలమయమైన రహదారులు

● ఎగసి పడుతున్న అలలు

అరసవల్లి/గార, ఆగస్టు 31: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లాలో రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం కూడా జిల్లాఅంతటా వర్షం కురవగా.. రహదారులు జలమయమయ్యాయి. శ్రీకాకుళంలోని పొట్టి శ్రీరాములు జంక్షన్, ఏడురోడ్ల జంక్షన్, మార్కెట్ ప్రాంతాల్లో కాలువల్లోని మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. అలాగే గార మండలం బందరువానిపేటలో సముద్రం అలలు ఎగసిపడ్డాయి. ఈ నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ సముద్రంలో చేపలవేటకు వెళ్లొద్దని అధికారులు ఆదేశించారు. కె.మత్స్యలేశం (కళింగపట్నం) పోర్టు వద్ద మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీచేశారు.

కూలిన వందేళ్లనాటి భారీ వృక్షం

గార మండలం అంపోలు రోడ్డు జంక్షన్ వద్ద వందేళ్ల నాటి భారీ మర్రి వృక్షం శనివారం ఉదయం కూలిపోయింది. ఆ సమయంలో ఇక్కడ జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో శ్రీకాకుళం నుంచి కళింగపట్నం వెళ్లే రోడ్డులో వాహనాలు రాకపోకలు స్తంభించిపోయాయి. విద్యుత్ స్తంభాలు కూడా విరిగిపోవడంతో.. సరఫరా నిలిచిపోయింది. ఆర్డీవో రంగయ్య, అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని చెట్టు తొలగింపు పనులు చేపట్టారు. ట్రాఫిక్ క్లియర్ చేశారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేశారు.

తుఫాన్‌పై అప్రమత్తం

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- తీరప్రాంతాలకు 11 మంది ప్రత్యేకాధికారులు
- ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కలెక్టరేట్, ఆగస్టు 31: 'బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారి.. తీరం దాటే సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అధికారులంతా అప్రమత్తంగా ఉండాల'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి కలెక్టర్ మాట్లాడారు. జిల్లా ఉన్నతాధికారులు, మండల ప్రత్యేకాధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల క్షేత్రస్థాయి అధికారులతో ఏర్పాట్లు, సహాయక చర్యలపై సూచనలు చేశారు. 'భారీ వర్షాల దృష్ట్యా తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. తీరప్రాంత మండలాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా దండోరా వేయించాం. అన్ని శాఖల అధికారులు ఎప్పటికప్పుడు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలి. నాగావళి, వంశధార నదుల పరీవాహక ప్రాంతాల్లో అధికారులు అనుక్షణం జాగ్రత్తగా ఉండాలి. జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది అంతా అందుబాటులో ఉండాలి' అని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు అందుబాటులో లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని, తుఫాన్ బాధితులు ఎవరైనా ఉంటే సహాయం కోసం 08942-240557 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. బాధితులకు అవసరమైన సామగ్రి సిద్ధం చేసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. వైద్యం, విద్యుత్, రహదారులు, భవనాలు, ఎస్ఈఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది కచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. జిల్లాలో 108 అంబులెన్స్ వాహనాలు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. తుఫాన్ సహాయక చర్యల పర్యవేక్షణకు తీరప్రాంత మండలాల్లో 11మంది ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. వీరితోపాటు తహసీల్దార్లు రానున్న మూడు రోజులు ఆయా మండలాల్లో పరిస్థితులను పర్యవేక్షిస్తారని తెలిపారు. అలాగే తుఫాన్ షెల్టర్లు, పునరావాస కేంద్రాలు సందర్శించి.. అవసరమైన ఆహార ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ప్రజల భద్రతే.. మన బాధ్యత

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ప్రజల భద్రతే.. మన బాధ్యత అని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య, విద్యుత్, వ్యవసాయ, పంచాయతీ, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖతోపాటు అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోను వేటకు వెళ్లవద్దని తెలిపారు.

ప్రత్యేకాధికారులు వీరే..

మండలం	ప్రత్యేకాధికారి	ఫోన్‌నెంబర్
రణస్థలం	కొవ్వాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి	9121251111
ఎచ్చెర్ల	డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు	8790008399
శ్రీకాకుళం	జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు	9100997770
గార	ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ	9440814582
పోలాకి	డీపీవో వెంకటరామన్	8919364818
సంతబొమ్మాళి	జేవీఎస్ రామ్మోహన్‌రావు	9440422302
వజ్రపుకొత్తూరు	పరిశ్రమలశాఖ మేనేజర్ ఉమామహేశ్వరరావు	9866530885
మందస	కో-ఆపరేటివ్ అధికారి బి.నగేష్	7093930101
సోంపేట	మైన్స్ డీడీ సత్యనారాయణ	9502225511
కవిటి	ఉద్యానశాఖ అధికారి ప్రసాదరావు	7995086758
ఇచ్ఛాపురం	డ్వామా ఏపీడీ శ్రీనివాసరెడ్డి	6309998070

వెలగాడను వీడని డయేరియా

● వ్యాధి లక్షణాలతో వృద్ధురాలి మృతి



నాగమ్మ (ఫైల్)

జి.సిగడాం, ఆగస్టు 31: జి.సిగడాం మండలం వెలగాడ గ్రామాన్ని డయేరియా వీడడం లేదు. ఈ వ్యాధి బారిన పడి 15 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డయేరియా లక్షణాలతో కోల నాగమ్మ(70) మృతి చెందింది. కొద్దిరోజుల కిందట డయేరియా బారిన పడిన నాగమ్మను రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్)కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకొచ్చారు. శనివారం వేకువజామున ఆమె మృతి చెందింది. దీనిపై వైద్యాధికారులు బి.అనూష, ప్రతిష్ఠశర్మ వద్ద ప్రస్తావించగా.. నాగమ్మ డయేరియాతో బాధ పడగా.. రాజాం, రిమ్స్‌లో వైద్యులు చికిత్స అందజేశారని తెలిపారు. ఆమె కు కిడ్నీలు కూడా పాడవడంతో అనారోగ్య సమస్యతో మృతి చెందినట్టు వివరించారు. ఇదిలా ఉండగా.. గ్రామానికి చెందిన గంగు సంధ్య, సీహెచ్ గోవిందమ్మ, గుడ్ల శ్వేత, ఎం.నర్సింగరావు, పి.రామారావు, పి.తులసమ్మ, ఎం.సరస్వతి, పి.సత్యవతి, పి.సాయి, పి.కన్నమ్మ, డి.సన్యాసిరావు, డి.ప్రవల్లిక, సీహెచ్ రమేష్, టి.తేజ తదితరులు రాజాంలోని ప్రభుత్వ, శ్రీకాకుళంలోని రిమ్స్, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. శనివారం సంధ్య డయేరియా బారిన పడగా రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని వైద్యాధికారులు అనూష, ప్రతిష్ఠశర్మ తెలిపారు. కొంతమంది బాధితులకు విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో సేవలు అందిస్తున్నామన్నారు.



చికిత్స చేస్తున్న వైద్యాధికారులు

ప్రభుత్వం మారినా.. అదే దూకుడు

● మాకివలస పాఠశాల ప్రహరీని కూల్చేసిన వైసీపీ నాయకుడు

● పోలీసులకు ప్రధానోపాధ్యాయుడు ఫిర్యాదు

నరసన్నపేట, ఆగస్టు 31: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా... వైసీపీ నాయకుల దూకుడు తగ్గడం లేదు. నరసన్నపేట మండలం మాకివలసలో ఓ వైసీపీ నాయకుడు.. అక్రమ నిర్మాణాల కోసం ఉన్నత పాఠశాల ప్రహరీని కూల్చేశారని స్థానిక యువత ఆరోపించారు. మంగళవారం వైసీపీ నాయకుడు పాఠశాల ప్రహరీని 15 అడుగుల మేరకు తొలగించారు. తొలుత ఈ ప్రహరీ కూలిపోయిందని అందరూ భావించారు. ఉపాధ్యాయులు కూడా చూసీచూడనట్టు వదిలేశారు. కాగా.. వైసీపీ నాయకుడు ఇంటి నిర్మాణ సామగ్రిని డంపింగ్ చేసేందుకు ప్రహరీని తొలగించారని యువత ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు దృష్టికి తీసు కెళ్లారు. ఆయన పోలీసులకు ఫిర్యా దు చేశారు. ఈ మేరకు శనివారం పోలీసులు వచ్చి.. ప్రహరీ తొలగింపు ఆరా తీశారు. కాగా.. ఆక్రమణ చేసేందుకు కాదని, బిల్డింగ్ మెటీరియల్ వేసేందుకు ప్రహరీ తొలగించాలని వైసీపీ నాయకుడు చెప్పినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



కూల్చేసిన ప్రహరీని పరిశీలిస్తున్న పోలీసులు

ఆంధ్రజ్యోతి

నవ్య | చిత్రజ్యోతి

శ్రీకాకుళం ఆదివారం • 1 సెప్టెంబరు 2024

cinema@andhrajyothy.com

ఓ యువకుడి న్యాయపోరాటం



ప్రియదర్శి కొత్త చిత్రం మొదలైంది. హీరో నాని సమర్పణలో వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై తయారయ్యే ఈ చిత్రానికి ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. రామ్ జగదీశ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రియదర్శిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నాని తొలి క్లాప్ ఇచ్చారు. అన్యాయంగా ఒక కేసులో ఇరికించిన ఓ కుర్రాడి కోసం జరిగే న్యాయపోరాటం ఈ చిత్రకథ అని దర్శకుడు చెప్పారు. శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్, శ్రీదేవి ఇతర ముఖ్యతారాగణం.

సుబ్రహ్మణ్య సాహసాలు



ప్రముఖ నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ రవిశంకర్ మరోసారి మెగాఫోన్ పట్టారు. తన కుమారుడు అద్వయ్‌ని హీరోగా పరిచయం చేస్తూ 'సుబ్రహ్మణ్య' చిత్రానికి ఆయన దర్శకత్వం వహిస్తున్నారు. తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియాల ఈ చిత్రానికి నిర్మాతలు. ఇప్పటికే అరవై శాతం నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న ఈ సినిమాను అడ్వెంచర్ థ్రిల్ అందించడానికి బిగ్ ఫార్మెట్‌లో చిత్రీకరిస్తున్నారు. అద్భుతమైన కథతో గ్రాండ్ విజువల్స్, ఎమోషనల్ ట్రీట్‌తో సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీత దర్శకుడు. విఘ్నేష్ రాజ్ ఛాయాగ్రాహకుడు.

ఏడాది కిందట



రఘు గద్వాల్ హీరోగా, ప్రియాంక శ్రీ, శివ ప్రసన్న హీరోయిన్లుగా టించిన ప్రేమకథా చిత్రం 'వెంకటలక్ష్మితో' పోస్టర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. 'ఏడాది కిందట' అనేది ట్యాగ్‌లైన్. రామమూర్తి కొట్టాల దర్శకత్వంలో ఆలేటి రాజేశ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'ఇది స్వచ్ఛమైన ప్రేమకథాచిత్రం. థ్రిల్లర్, సస్పెన్స్ ఎలిమెంట్స్ ఉంటాయి. అంతా కొత్తవారితో తీశాం' అన్నారు దర్శకుడు.

'ప్రణయ గోదారి' పాట



సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన 'ప్రణయ గోదారి' చిత్రం నుంచి 'గు గు గ్గు' అంటూ సాగే హుషారైన పాటను ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేశ్ విడుదల చేశారు. మార్కండేయ రాసి స్వరపరిచిన ఈ పాటను భార్గవి పిళ్లై పాడారు.ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత పారమళ్ల లింగయ్య చెప్పారు. పి.ఎల్.విఘ్నేశ్ ఈ చిత్రానికి దర్శకుడు.

అమ్మగా నటించడానికి ఇబ్బంది పడలేదు



ఇప్పుడు సొసైటీలో 22 ఏళ్లకే పెళ్లి ఎప్పుడు అని అడుగుతున్నారు. అందుకే నేను హౌస్ వైఫ్‌గా, అమ్మగా నటించడానికి ఇబ్బంది పడలేదు. నటిగా అన్ని పాత్రలూ చేయాలి. అయితే తల్లిగా బాగా చేశావు అనేకంటే సరస్వతి పాత్రను చక్కగా పోషించావని అంటే సంతోషిస్తా' అన్నారు నివేదా థామస్. రానా సమర్పణలో రూపుదిద్దుకున్న ' 35.. చిన్న కథ కాదు' చిత్రం ఈ నెల ఆరున విడుదలవుతున్న సందర్భంగా శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఇందులో సరస్వతి పాత్రకు, నాకు వయసులో పెద్ద తేడా లేదు. సరస్వతి నాకంటే ఏడాది చిన్నది. తనకు పెళ్లయి పిల్లలు ఉన్నప్పటికీ చైల్డ్ నేచర్ ఉంటుంది. '35 చిన్న కథ కాదు.. కథని దర్శకుడు నందకిశోర్ అద్భుతంగా రాశారు. తిరుమల వేంకటేశ్వర స్వామి కూడా ఈ కథలో ఓ పాత్ర పోషించారు. ఆ డివైన్ ఫీలింగ్ అన్ని సీన్స్‌లో ఉంటుంది. ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా అవుతుంది' అన్నారామె. 'ఇందులో తిరుపతి స్లాంగ్ కోసం దాదాపు నెల రోజులు వర్క్‌షాప్ చేశాం. పతి పదాన్నీ క్షుణ్ణంగా నేర్చుకున్నా' అని చెప్పారు నివేద. గౌతమి కీలక పాత్ర పోషించారనీ, ఆమెతో నటించడం ఇది రెండో సారని నివేద చెప్పారు. కొత్త ప్రాజెక్టులు ఏవీ ఒప్పుకోలేదని, త్వరలోనే చెబుతానని అన్నారు.

ఈ సక్సెస్‌తో ఆ వెలితి తీరింది

'పదిహేను రోజులుగా మా టీమ్‌లో ఎవరికీ సరిగ్గా నిద్ర లేదు. రిలీజ్ రోజు నుంచి ఎన్నో అభినందనలు, ప్రశంసలు వస్తున్నాయి. సినిమా బాగుంటే ప్రేక్షకుల తల మీద పెట్టుకుంటారని మరో సారి నిరూపించినందుకు కృతజ్ఞతలు. ఇంత వర్షంలో కూడా అన్ని చోట్లా హౌస్‌ఫుల్స్ అవుతున్నాయి. 'అంటే సుందరానికి' రావాల్సిన బాక్సాఫీసు సక్సెస్ రాలేదనే చిన్న వెలితి ఉండేది. 'సరిపోదా శనివారం'తో అది బ్యాలెన్స్ అయింది. 'నిన్ను కోరి' తర్వాత దానయ్యగారితో రెండో సినిమా. మా మూడో సినిమాపై



అంచనాలు భారీగా ఉంటాయి. దానికి తగ్గ సెటప్ చేద్దాం. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్ సెలబ్రేషన్స్ ఈవెంట్ ఉంటుంది' అన్నారు హీరో నాని. శనివారం జరిగిన 'సరిపోదా శనివారం' థాంక్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ 'నా మీద నాకున్న నమ్మకం కంటే నా మీద నానికి నమ్మకం ఎక్కువ. ఆయన ఫ్రీడమ్ ఇచ్చారు కనుకే ఇలాంటి మంచి సినిమా వచ్చింది. ఇంత భారీ చిత్రాన్ని నేను హ్యాండిల్ చేయగలనని నమ్మి భారీ బడ్జెట్ పెట్టిన దానయ్యగారికి థాంక్స్. తొలి సినిమాతోనే పెద్ద హిట్ కొట్టిన కల్యాణ్‌కు అభినందనలు' అన్నారు. 'ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లోనే సినిమా పెద్ద హిట్ అవుతుందని చెప్పాను. ఈ రోజు రిజల్ట్ అలాగే ఉంది' అన్నారు దానయ్య.

అమ్మ కల నెరవేరింది



సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ శనివారం కర్ణాటకలోని ఉడుపి శ్రీకృష్ణమఠాన్ని సందర్శించారు. తన తల్లి శాలిని, భార్య లక్ష్మీ ప్రణతితో కలసి ఆయన ఉడుపికి వెళ్లారు. 'మా అమ్మ ఎప్పుడూ తన సొంతూరు కుందాపురాతో పాటు ఉడుపి శ్రీకృష్ణుని దర్శనానికి తీసుకెళ్లమని అడుగుతుంది. ఇన్నాళ్లకు అమ్మ కల నెరవేరింది. సెప్టెంబర్ 2న అమ్మ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమెకు నేను ఇచ్చే బహుమతి ఇదే' అని ఎన్టీఆర్ తెలిపారు. ఇటీవల జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు పొందిన 'కాంతార' ఫేం రిషబ్ శెట్టి, దర్శకుడు ప్రశాంత్ నీల్ వారిని సాదరంగా ఆహ్వానించారు. ఆ తర్వాత శ్రీకృష్ణ మఠంలో అందరూ పూజలు నిర్వహించారు.

బెంగళూరు, (ఆంధ్రజ్యోతి)

మా జీవితాల్ని మార్చిన సినిమా



హరీశ్ శంకర్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ హీరోగా రూపొందిన 'గబ్బర్‌సింగ్' చిత్రం ఆయన పుట్టినరోజు సందర్భంగా సోమవారం రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో బండ్ల గణేశ్ మాట్లాడుతూ 'నా తల్లితండ్రులు నాకు జన్మనిస్తే పవన్‌కల్యాణ్ బతుకునిచ్చారు. నన్ను నేను నమ్మలేని స్థితిలో ఉన్నప్పుడు ఆయన పిలిచి 'గబ్బర్‌సింగ్ 'సినిమా ఇచ్చి నన్ను నిలబెట్టారు. ఈ చిత్ర దర్శకుడు హరీశ్ శంకర్ రాబోయే పాతికేళ్లు తెలుగు చిత్రపరిశ్రమలో నంబర్ వన్‌గా ఉంటారు' అని చెప్పారు. 'సోషల్ మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న ఈ రోజుల్లో 'గబ్బర్‌సింగ్' రిలీజ్ అయి ఉంటే ఎంత బాగుండేదో అనే వెలితి నా మనసులో ఉండేది. ఇప్పుడు ఆ సినిమా రీ రిలీజ్‌తో అది తీరుతోంది. మా జీవితాలను మార్చేసిన సినిమా 'గబ్బర్‌సింగ్'' అని హరీశ్‌శంకర్ చెప్పారు.

అన్ని రంగాల్లో ఉన్నదే సినీ పరిశ్రమలోనూ జరుగుతోంది

- లైంగిక వేధింపులపై మోహన్‌లాల్ స్పందన
- నేనెవరికీ వత్తాసు పలకలేదు

'సమాజంలో సినీరంగం కూడా ఒక భాగం. అన్ని రంగాల్లో ఉన్నట్లే సినీ రంగంలోనూ లైంగిక వేధింపులు ఉన్నాయి. పరిశ్రమలో తలెత్తే ప్రతి సమస్యకు బాధ్యత వహించాల్సిన అవసరం అమ్మ (అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్)కు లేదు' అని మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ అన్నారు. 'అమ్మ'కు రాజీనామా చేశాక శనివారం ఆయన తొలిసారి మీడియా ముందుకొచ్చారు. 'హేమ కమిటీ నివేదికను స్వాగతిస్తున్నాం, కేరళ ప్రభుత్వం, పోలీసులు నివేదికపై దర్యాప్తు చేస్తున్నందువల్ల నిజం తేలేవరకూ ఓపికపట్టాలి, పరిశ్రమ పేరును చెడగొట్టొద్దు' అని ఆయన మీడియాకు విజ్ఞప్తి చేశారు. 'ఫిల్మ్ ఇండస్ట్రీలోని పవర్ గ్రూప్ గురించి నాకు తెలియదు. ఇలాంటిది ఒకటుందని హేమ కమిటీ చెబితేనే విన్నాను. ఏ పవర్ గ్రూప్‌తోనూ నాకు సంబంధం లేదు. సినీ పెద్దలకు అండగా నిలుస్తున్నట్లు నాపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. పరిశ్రమలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాల్సిందే, ఆ విషయంలో పోలీసులకు సహకరిస్తాం' అని స్పష్టం చేశారు. పరిశ్రమలో ఎన్నో అసోషియేషన్లు ఉండగా, ఏం జరిగినా 'అమ్మ'పైన రుద్దేప్రయత్నం చేస్తుండడం దురదృష్టకరమన్నారు. మహిళలపై వేధింపుల విషయంలో మొత్తం చిత్ర పరిశ్రమ బాధ్యత తీసుకోవాలి కానీ కావాలనే అమ్మను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. 'వేలాది మందికి ఉపాధిని కల్పిస్తోన్న మలయాళ చిత్ర పరిశ్రమ కుటుంబం లాంటిది. దయచేసి దాన్ని లక్ష్యంగా చేసుకోవద్దు. పరిశ్రమను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందరూ సంయమనం పాటించాలి' అని మోహన్‌లాల్ కోరారు. 'అమ్మ' కార్యవర్గం రాజీనామా వైఫల్యం



కాదు, బాధ్యతల నుంచి మేం పారిపోలేదు. మా స్థానంలో కొత్త కార్యవర్గం వచ్చి అమ్మను సమర్థవంతంగా నడుపుతుంది' అని తెలిపారు. బాధ్యతల నుంచి నేనెప్పుడూ పారిపోలేదు, అత్యవసర పనుల వల్ల ఇప్పటివరకూ మీడియా ముందుకు రాలేకపోయాను అని మోహన్‌లాల్ చెప్పారు.

సీక్రెట్ కెమెరాలు పెట్టారు - నటి రాధిక ఆరోపణ

మాలీవుడ్‌లో కేరవాన్‌లలో రహస్య కెమెరాలు అమర్చి హీరోయిన్లు దుస్తులు మార్చటాన్ని వీడియో తీసిన ఘటనలు జరిగాయని, అలాంటి వీడియోలను సినీ యూనిట్ సభ్యులు వీక్షించడాన్ని తాను స్వయంగా గమనించానని సీనియర్ సినీనటి రాధిక శరత్‌కుమార్ ఆరోపించారు. కేరవాన్‌లలో కెమెరాలు అమర్చుతున్నారని తెలిసిన తర్వాత తాను హోటల్ గదుల్లో దుస్తులు మార్చుకున్నానని చెప్పారు. ఆమె ఓ తమిళ టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ విధానమే సక్రమంగా లేదని, మగవారెవరూ హీరోయిన్లకు, నటీమణులకు మద్దతుగా మాట్లాడటం లేదని వాపోయారు. హీరోయిన్ల గది తలుపులు తట్టే పరిస్థితులు అన్ని సినీ విభాగాల్లో ఉన్నాయన్నారు. లైంగిక వేధింపులను ఎదుర్కొనే ధైర్యాన్ని మహిళలు మరింత పెంచుకోవాలని ఆమె సూచించారు.

నాకు ఎవరూ ఫొటోలు పంపలేదు

సజీర్ అనే వ్యక్తి నగ్న చిత్రాలను ఫోన్‌లో చిత్రీకరించి వాటిని నటి రేవతికి పంపినట్లు మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. సినిమాల్లో అవకాశం ఇస్తానని తనపై దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ లైంగిక దాడికి పాల్పడినట్లు సజీర్ అనే వ్యక్తి ఇటీవలే ఆరోపించాడు. ఆ సంఘటన జరిగిన రోజు నటి రేవతి కూడా హోటల్ రూమ్‌లో ఉన్నట్లు రంజిత్ చెప్పినట్లు సజీర్ తెలిపాడు. ఈ ఆరోపణలపై రేవతి స్పందించారు. మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు. తనకు ఎవరూ ఎలాంటి ఫొటోలను పంపలేదని స్పష్టం చేశారు. మరోసారి దీని గురించి మాట్లాడాల్సిన అవసరం తనకు లేదని రేవతి పేర్కొన్నారు.

విస్తారంగా వర్షాలు

● ముందుకొచ్చిన సముద్రం
● అల్పపీడనంతో అప్రమత్తమైన అధికారులు
● వేటకు వెళ్ల వద్దని మత్స్యకారులకు సూచన

హరిపురం: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో గడచిన మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారి అల లు ఎగిసిపడుతున్నాయి. దీంతో తీరప్రాంత వాసులు భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. తీరప్రాంతం కోతకు గురై సుమారు 15 అడుగుల మేర సముద్రం ముందుకు చొచ్చుకు రావడంతో మత్సకారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో రట్టి, గెద్దూరు, సింక్లాపుట్టుగ, టి.గంగువాడ, బేతాళ పురం, లక్ష్మీపురం, దున్నూరు తదితర గ్రామాల వద్ద తీర ప్రాంతంలో ఇదే పరిస్థితి నెలకొంది. మత్స్యకారులు తెప్పలు, బోట్లను సురక్షితంగా ఒడ్డుకు చేరుస్తున్నారు. అప్రమత్తంగా ఉండాలని, వేటకు వెళ్లవద్దని రెవెన్యూ అధికారులు సూచ నలు చేశారు. మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ సూచనతో అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా వర్షాభావ పరిస్థితులతో ఇప్పటివరకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు కురిసిన వర్షం ఊరట నిచ్చింది. ఉద్దానంలో వరి పంటకు, జీడి, కొబ్బరి చెట్లకు ఈ వర్షం ప్రాణవాయువుగా మారిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



హరిపురం: సంకుజోడి చానల్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

తుఫాన్ ప్రభావంతో వర్షాలు

నందిగాం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శనివారం విస్తారంగా వర్షాలు పడ్డాయి. వాయుగుండం కళింగపట్నం సమీపంలో తీరం దాటుతుందన్న హెచ్చరికలతో మండల అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు. తుపాన్ ప్రభావంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపీడీవో టి.రాజారావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎన్.భాగ్యలక్ష్మి సూచనలిచ్చారు. రక్షిత పథకాల్లో నీరు నింపాలని, బ్లీచింగ్, ఇతర సామగ్రి సచివాలయాల్లో ఉంచాలన్నారు. అయితే వర్షం కారణంగా తహసీల్దార్, ఎమ్మార్సీ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరం పైకప్పులు లీకై సిబ్బంది విధులకు ఆటంకం కలిగింది. పలు గ్రామాల్లో రోడ్లు వర్షపునీటితో నిండిపోవడంతో ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



నందిగాం: ఎమ్మార్సీ కార్యాలయ కంప్యూటర్ గదిలో కారిన వర్షపు నీరు

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు

వజ్రపుకొత్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సముద్రం సుమారు 50 మీటర్ల మేర ముందుకు రావడంతో మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు. వలలు, బోట్లు, పడవలు ఒడ్డుకు తీసుకువస్తున్నారు. మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లవద్దని మండల ప్రత్యేకాధి కారి బి.ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ పి.బాల, ఎంపీడీవో బి.ఈశ్వరమ్మ సూచించారు. శనివారం అక్కుపల్లి, భైపల్లి, డోకులపాడు, మంచినీళ్లపేట, హుకుంపేట, కంబారాయుడి పేట, కొత్తపేట. పూడిలంక, నువ్వలరేవు గ్రామాల్లో పర్యటించి సముద్ర తీర ప్రాంతాలను పరిశీలించారు. సముద్రంలో కెరటాల తాకిడి అధికంగా ఉన్నందున ఆదివారం సముద్ర స్నానాలకు వెళ్లవద్దన్నారు. వీఆర్‌ఏలు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. బెండిగెడ్డ ఉధృతంగా పారు తుండడంతో నగరంపల్లి కల్వర్టు వద్ద ఉప్పుటేరులో కలుస్తూ లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. పూడిలంక గ్రామం చుట్టూ నీరు చేరడంతో గ్రామస్థులను అధికారులు అప్రమత్తం చేశారు. వారి వెంట డీటీ వి.గిరిరాజు, ఆర్‌ఐ పవిత్ర, వీఆర్వోలు ఇందిర, వెంకటరావు, సచివాలయ కార్యదర్శి రాజేష్ ఉన్నారు.



వజ్రపుకొత్తూరు: శివసాగర్ తీరంలో మత్స్యకారులకు సూచనలిస్తున్న అధికారులు

కడపలగెడ్డపై నీటి ప్రవాహం

● దబ్బపాడు నుంచి నిలిచిన రాకపోకలు

ఎల్.ఎన్.పేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తురకపేట, దబ్బపాడు గ్రామాల మధ్య ఉన్న కడపలగెడ్డ రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో దబ్బపాడు నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాకాలం వచ్చిందంటే రోజుల తరబడి రాకపోకలు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం పట్టణాలకు వెళ్లాలంటే దబ్బపాడు నుంచి వాడవలస, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట గ్రామాల మీదుగా లక్ష్మీనర్సుపేట గ్రామాల మీదుగా ఎల్‌ఎన్‌పేట జంక్షన్‌కు సుమారు ఐదు కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



కడపల గెడ్డపై ప్రవహిస్తున్న నీరు

ముంపు పొలాల పరిశీలన

సుసరాం(పోలాకి): గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన తంపర పొలాలను శనివారం వ్యవసాయాధికారి చిరంజీవి పరిశీలించారు. ప్రతి ఏటా తంపర భూములు ముంపు నకు గురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. రాయితీపై విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలాలని రైతులు కోరారు. తంపర ముంపు నివారణకు టీడీపీ హయాంలో రూ.12 కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. సాయంత్రం గుప్పెడుపేట సాగరతీర గ్రామాలను తహసీల్దార్ సురేష్ కుమార్ సందర్శించి మత్స్యకారులకు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు.



పోలాకి: పొలాలను పరిశీలిస్తున్న ఏవో చిరంజీవి

లైట్లు, ఫ్యాన్లు పనిచేయవా?

● గర్భిణుల వార్డులోనూ ఇదే పరిస్థితా..
● జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సేవలపై మంత్రి అచ్చెన్న ఆగ్రహం

టెక్కలి, ఆగస్టు 31: ఆసుపత్రిలో పలు వార్డులు చీకటిగా ఉన్నాయి.. ఫ్యాన్లు తిరగడం లేదు.. మీరేమన్నా కరెంట్ బిల్లులు కడుతున్నారా.. రోగులకు ఇలాగేనా వైద్య సేవలందించేదని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం ఆయన జిల్లా కేంద్ర ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసూతి వార్డుల్లోనూ ఫ్యాన్లు తిరగకుంటే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పరి స్థితి ఏమిటి, వార్డులూ చీకటిగా ఉన్నాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సూర్యా రావుపై అసహనం వ్యక్తం చేశారు. రోగులకు సేవలందించడంలో మీరు మారుతారా.. మమ్మల్నే మారమంటారా అంటూ ప్రశ్నించారు. ఎందుకు ఫ్యాన్లు, లైట్లు వేయడం లేదని సూప రింటెండెంట్‌ను ప్రశ్నించగా ఆయన నీళ్లు నమిలారు. అసల ఇక్కడ ఎలక్ట్రీషియన్ ఎవరు.. పిలవండని కోరారు. ఈసారి ఇదే పరిస్థితి ఉంటే విధుల నుంచి తప్పించాల్సి ఉంటుందని ఎలక్ట్రీషియన్ బొంగు వైకుంతరావును హెచ్చరించారు. డాక్టర్ లక్ష్మణరావు గది లో టేబుల్‌ను చూసి అసంతృప్తి వ్యక్తం చేస్తూ కనీసం కర్టెన్లు, టేబుల్ క్లాత్‌లు కొనుక్కునే స్థితిలో ఆసుపత్రి ఉందా అంటూ ప్రశ్నించారు. సీటీ స్కాన్ గదిని పరిశీలించగా విద్యుత్ సరఫరాలో తరచూ ఇబ్బందులు ఎదురవుతు న్నాయని సిబ్బంది పేర్కొనగా అవసరమైతే ఆసుపత్రిలో ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈ తమ్మి నేని ఈశ్వరరావుకు మంత్రి ఫోన్‌లో ఆదేశిం చారు. రోగులు, వారి సహాయకులు కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలని, ఇంజక్షన్లను ఆరుబయట కాకుండా ప్రత్యేక గదిలో వేయాలని సూచించారు. మరుగుదొడ్లను పరిశీలించి తక్షణం బాగు చేయించాలని సూపరింటెండెంట్‌కు ఆదేశించారు. చిన్న చిన్న పనులు చేయించుకోలేరా అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. లిఫ్టులు పనిచేసేలా చూడాలని, వీల్‌ఛైర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆసు పత్రి ఆవరణ అంతా చెత్తాచెదారాలతో నిండి ఉందని, దీనివల్ల రోగులకు ఆరోగ్యం ఎలా సిద్ధిస్తుందని ప్రశ్నిస్తూ తక్షణం పారిశుధ్య పనులు చేయాంచాలని ఆదేశించారు. మరలా వచ్చేటప్పుడు ఆసుపత్రి సేవల్లో తప్పిదాలు కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు కింజరాపు హరివరప్రసాద్, బగాది శేషగిరి, పినకాన అజయ్ కుమార్, కామేసు, ప్రీతీష్, ప్రసాద్‌రెడ్డి, మట్ట పురుషోత్తం, కింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి అధికారులను ప్రశ్నిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఇదేమైనా డంపింగ్ యార్డా?

● మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: ఇదేమైనా డంపింగ్ యార్డు అనుకుంటు న్నారా.. రోడ్లపై చెత్త వేస్తే ఎలా అని మంత్రి అచ్చెన్నాయుడు స్థానికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రావివలస సచివాలయ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన పాత జాతీయ రహదారి పాలకేంద్రం జంక్షన్‌లో రోడ్డుపై చెత్త కుప్పలను చూసి వాహనాలను ఆపి అసహనం వ్యక్తం చేశారు. వెంటనే మేజర్ పంచాయతీ ఈవో జగన్నాథరావుతో ఫోన్‌లో మాట్లాడి తక్షణం చెత్తకుప్పలు తొలగించాలని ఆదేశించారు. ఇకపై ఎవరైనా ఈ ప్రాంతంలో చెత్త వేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

రహస్య వీడియోలు తీసిన వారిని కఠినంగా శిక్షించాలి

పలాసరూరల్: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల హాస్టల్‌లో రహస్య కెమెరాలు పెట్టి వీడియోలు తీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీవో డబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ డిమాండ్ చేశారు. బొడ్డపాడు సంఘ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లక్షల రూపాయలు ఫీజులు దండుకుంటూ హాస్టళ్లలో సరైన పర్యవేక్షణ లేకపోవడం దారుణమన్నారు. ఈ విషయంలో ముందస్తు సమాచారం ఉన్నా యాజమాన్యం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం నిజనిజాలను వెలుగులోకి తీసుకురావాలని, నిందితులను, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు కుత్తుమ హేమ, బర్ల జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిజోరాం గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస/ పలాస రూరల్: మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబును ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆమె భర్త, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త వెంకన్న చౌదరి విశాఖపట్నంలో శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గౌతు లచ్చన్నతో తన కున్న సంబంధాలను హరిబాబు గుర్తు చేసుకున్నారు. ఆయన మనువరాలిగా శిరీష ప్రజా సేవకు అంకితం కావడాన్ని అభినందించారు. శిరీష మాట్లాడుతూ.. తన తాతయ్య గౌతు లచ్చన్న ఆత్మీయ అను చరులను కలవడం ఆనందంగా ఉందన్నారు.



మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబుతో ఎమ్మెల్యే గౌతు శిరీష దంపతులు

కల్తీ డీజిల్ విక్రయంపై ఆందోళన

హరిపురం: మందస మండలంలోని ఓ పెట్రోల్ బంకులో కల్తీ డీజిల్ విక్రయిస్తున్నారంటూ పలువురు కొనుగోలుదారులు శనివారం ఆందోళన వ్యక్తంచేశారు. సోంపేట మండలం తాళ్లభద్ర గ్రామానికి చెందిన సారి జోగారావు, జగదీష్, రౌతు కృష్ణారావుతోపాటు మరికొందరు ట్రాక్టర్ల కోసం డీజిల్ కొనుగోలుకు వచ్చారు. క్యాన్లలో డీజిల్ నింపుకొని గ్రామానికి వెళ్లి ట్రాక్టర్లలో వేశారు. ఈ సమయంలో ట్రాక్టర్ యజమాని జగదీష్ డీజిల్ రంగు, వాసనను పరిశీలించారు. తేడా ఉన్నట్లు గుర్తించి ట్రాక్టర్‌లో వేయకుండా బంక్‌కు ఆ క్యాన్లతో వచ్చారు. బకెట్‌లలో డీజిల్‌ను వేసి పరిశీలిం చగా రంగు, వాసనలో స్పష్టమైన తేడా కనిపించింది. డీజిల్ వేసిన రెండు ట్రాక్టర్లు నిలిచిపోయాయని బాధితులు తెలిపారు. దీంతో బంకు యజమాని ఆ డీజిల్‌ను తీసుకుని మరలా మరో ట్యాంకులోని డీజిల్‌ను ఇచ్చి సర్ది చెప్పారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వినియోగ దారులు తెలిపారు.

సేవలే గుర్తింపునిస్తాయి

మందస: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంఈవోలు ఎం.లక్ష్మణరావు, ఎం.భాస్కరరావు అన్నారు. నారా యణపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయుడి గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన బాడ కుశరాజు, చంద్రమణి దంపతులను శనివారం పాఠశాలలో హెచ్‌ఎం జి.లోహితాస్యుడు ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం ఉపాధ్యాయులకే దక్కు తుందన్నారు. సర్పంచ్ బి.తేజేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు జి.పార్వతి, కేశవరావు, సిబ్బంది ఆర్.జయలక్ష్మి, ఎం.మోహనరావు, బాలకృష్ణ, హెచ్. వెంకట్రావు, ఎస్.అరుణ, జి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



కుశరాజు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

పాతపట్నం/కొత్తూరు: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నం మండలం తిడ్డిమి, మండలంలోని ఓంద్రుజోలలో శనివారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్ర మంలో ఎంపీడీవో పావని, వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాద్, సామాజికవేత్త రాజు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకోవాలి

హిరమండలం: కొత్తూరు మండలం ఆకులతంపర నుంచి ఇసుక అక్రమంగా తరలించినట్లు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇసుకను తరలిస్తున్న నాలుగు వాహనాలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మూర్తి పట్టుకోవడాన్ని తాను సమర్థిస్తున్నానన్నారు. ఈ ఘటనపై అధికారుల ద్వారా ఇసుక తరలిస్తున్న వారితో మాట్లాడానన్నారు. వారి వద్ద ఒడిశా ర్యాంపునకు చెందిన బిల్లులున్నాయని చెప్పారని, ఒడిశా నుంచి నివగాం మీదుగా రాంగ్‌రూట్‌లో వచ్చినట్లు పేర్కొన్నారని ఎమ్మెల్యే తెలిపారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం

హిరమండలం: పర్యావరణ హితమే లక్ష్యం గా వినాయక నవరాత్రుల్లో మట్టి గణపతిని పూజిద్దామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శనివారం 1000 మట్టి గణపతి విగ్రహాలు, 3000 వినాయక వ్రతకథ పుస్తకాలను టీడీపీ నేతలతో కలిసి పంపిణీ చేశారు. నేతలు పి.బుచ్చిబాబు, నందిగాం సాయికృష్ణ పట్నాయక్, టి.మేనక తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ నేడు నిరసన

టెక్కలి: సీపీఎస్ రద్దు కోరుతూ ఇందిరాగాంధీ కూడలి వద్ద ఆదివారం ఉదయం 9గంటలకు నిరసన చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డేపల్లి నేతాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

వయ్యారిభామ కలుపుతో ప్రమాదకరం

పలాసరూరల్: వయ్యారిభామ కలుపు అత్యంత ప్రమాదకరమని, దీనిని తొలగించి కాల్చాలని బ్రాహ్మణతర్లా పాఠశాల హరితదళ క్లబ్ సభ్యులు అన్నారు. బ్రాహ్మణతర్లా జడ్పీ పాఠశాలలో శనివారం వయ్యారిభామ కలుపు మొక్కలపై అవగాహన వారోత్సవాన్ని జూనియర్ రెడ్‌క్రాస్‌తో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్‌వీ రమణారావు, ఎన్‌జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, జాతీయహరితదళ క్లబ్ సభ్యులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

జలుమూరు: రోగులకు సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. 'ఆంధ్ర జ్యోతి'లో శనివారం 'శ్రీముఖలింగంలో డెంగ్యూ కలకలం' శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందించి అచ్యుతాపురం పీహెచ్‌సీని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. శ్రీముఖలింగంలో జ్వరాలు ఎక్కువగా ఉన్నందున ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి జ్వరపీడితులను గుర్తించి రక్త నమూనాలు సేకరించాలన్నారు. విధి నిర్వహణలో అల సత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చ రించారు. ఆయనతో పాటు వైద్యాధికారి ప్రసన్నలక్ష్మి, టీడీపీ నాయకులు వెలమల రాజేంద్రనాయుడు, ఎం.దామోదరరావు, వెలమల చంద్రభూషణరావు, పంచిరెడ్డి రామచంద్రరావు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వైద్యాధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

చిన్నదూగాంలో వైద్య పరీక్షలు

జలుమూరు: చిన్నదూగాంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. జలుమూరు వైద్యాధికారి చల్ల వంశీకృష్ణ రోగులనుపరీక్షించి మందులను పంపిణీ చేశారు. ముగ్గురు జ్వరాలతో బాధపడు తున్నారని, 18 మంది దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో బాధపడుతుండగా పరీక్షించి మందులు పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. వేడి పదార్థాలను భుజించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి చిన్నరాజులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిపైకి గెడ్డనీరు



గెడ్డ మూసుకుపోయి రోడ్డు పైకి చేరిన నీరు

కొత్తూరు: వందలాది ఎకరాలకు సాగునీరందించే హడ్డుబంగి గెడ్డలో పూడికతీయకపోవడంతో ఏమాత్రం వర్షం కురిసినా నీరంతా పాలకొండ, హడ్డుబంగి ప్రధాన రహదారిపైకి వచ్చి రోజుల తరబడి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సాగునీటి కాలువల నిర్వహణను పట్టించుకోక పోవడంతో ఈ పరిస్థితి నెలకొందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి సాగునీటి కాలువలోని నీరంతా సామాజిక ఆసుపత్రి ప్రాంగణం, రెల్లివీధిలోని ఇళ్లలోకి చేరుకుంటోంది. మరోవైపు గెడ్డకు ఆనుకొని ఉన్న ఇళ్ల యజమానులు, వ్యాపారులు వ్యర్థాలను గెడ్డలో వేయడంతో దారుణంగా తయారైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు హడ్డుబంగి గెడ్డలో పూడికతీత చేపట్టాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

జీవో 117 రద్దు చేయాలి

నరసన్నపేట: ప్రతీ గ్రామంలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు పాఠశాలలుండే విధంగా జీవో నెంబరు 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ సంఘనాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. అధికారంలో వచ్చిన వెంటనే జీవో 117 రద్దు చేస్తామని ప్రస్తుత విద్యామంత్రి హామీ ఇచ్చారని, దీనిని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి, ఎస్.రాజేష్, ఉమాభాస్కర్, కె.ఆదినారాయణ, సునీల్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణపై సమీక్ష


కత్తెరవానిపేట(పోలాకి): ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం కత్తెరవానిపేట క్యాంపు కార్యాలయంలో సీఐ శ్రీనివాసరావు, నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట ఎస్‌ఐలతో శాంతి భద్రతల పరిరక్షణపై సమీక్షించారు. నేరాల అదుపునకు కృషి చేయాలన్నారు.

మాజీ సైనికుల నుంచి వినతుల స్వీకరణ

టెక్కలి: మాజీ సైనికుల సమస్యలపై జిల్లా సైనిక అధికారి శైలజ శనివారం వినతులు స్వీక రించారు. స్టీఆర్ కాలనీలో ఉన్న మాజీ సైనికుల సంఘ భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు మాజీ సైనికులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘ అధ్యక్షుడు సోమేశ్వరరావు, గోవిందరాజులు, మాధవరావు పాల్గొన్నారు.

ఆరునెలల బకాయిలు చెల్లించాలి

పాతపట్నం: వెలుగులో పనిచేస్తున్న సిబ్బందికి ఆరునెలల బకాయి వేతనాలు చెల్లించాలని వీవోఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. ఏఎంసీ ప్రాంగణంలో శనివారం సంఘ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూరయ్య మాట్లాడుతూ.. అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.









ఒక రోజు ముందే..

- జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ
- వర్షం కురుస్తున్నా ఆగని వైనం


పొందూరు: డయాలసిస్ బాధితుడికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

జిల్లా వ్యాప్తంగా శనివారం సామజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఒకరోజు ముందే పింఛను అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో వర్షంలో తడుస్తూ అధికారులు, సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం


శ్రీకాకుళం: కిష్టప్పపేట గ్రామంలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్


జి.సిగడాం: ఎందువలో చిన్నారికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్


నరసన్నపేట: పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


పాతపట్నం: తిడ్డిమిలో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


అరసవల్లి : పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్

భర్త ఇంటికి తాళం వేసిన భార్య


ఇంటికి తాళం వేసిన సుహాసిని, కుటుంబ సభ్యులు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ రామదాసుపేటలో నివాసం ఉంటున్న కోతి రామకృష్ణ, సుహాసిని దంపతులకు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. తన భర్త రామకృష్ణ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తమకు అన్యాయం చేస్తున్నాడని భార్య సుహాసిని, కుమారుడు పవన్, కుమార్తె ఝాన్సీరాణిలతో కలిసి ఆ ఇంటికి తాళం వేసి.. నిరసన తెలిపింది. భర్త వేరే మహిళతో ఆ ఇంట్లో ఉండగా సుహాసిని తాళం వేయడంతో ఈ విషయం పట్టణంలో గుప్పుమంది. ఇటు సుహాసిని గానీ, భర్త రామకృష్ణ గానీ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

జాతీయ రహదారిపై వృద్ధుడి మృతి..

నరసన్నపేట: స్థానిక జాతీయ రహదారిపై బైపాస్ రోడ్డులో రణస్థలం మండలం కొండములగాంకు చెందిన సిద్ధాంతం సత్యం (70) మృతి చెందినట్లు ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన అనారోగ్యంతో బాధ పడు తుంటే రెండు రోజుల క్రితం శ్రీకాకుళంలోని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి తప్పించుకున్న సత్యం నరసన్నపేట వరకు వచ్చి రోడ్డుపై విగత జీవిగా పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ దుర్గాప్రసాద్ పరిశీలించారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మేన్‌కు గాయాలు..

టెక్కలి: స్థానిక పాత మండల పరిషత్ కార్యాలయానికి ఎదురుగా విద్యుత్ షాక్‌తో ప్రైవేట్ లైన్‌మేన్ బొమ్మాళి బాలరాజు తీవ్ర గాయాల పాలయ్యాడు. గాయపడిన బాలరాజును తోటి సిబ్బంది జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. బాలరాజు టెక్కలి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రైవేట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఆపబోయి... మరో ట్రాన్స్‌ఫార్మర్ ఆపి మరమ్మతుల కోసం విద్యుత్ స్తంభం ఎక్కాడు. విద్యుత్ షాక్‌కు గురై కిందపడ్డాడు. గాయపడిన బాలరాజుది సంతబొమ్మాళి మండలం గొల్లసీతాపురం గ్రామం. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో ముగ్గురికి గాయాలు..

కోటబొమ్మాళి: జాతీయ రహదారిలో చిన్నతుంగ గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వెళుతున్న ఆటోను వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 9 మందిలో ముగ్గురు తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలందించారు. ఎస్ఐ మహమ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి..

ఇచ్ఛాపురం: ఈదుపురం బాహుదా నది ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు రూరల్ ఎస్ఐ శ్రీనువాసరావు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని పరిశీలించి... ఇచ్ఛాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ శిథిలమైన, పాత ఇళ్లలో ఉండవద్దని, నదులు, చెరువులు, కాలువల్లో స్నానాలకు వెళ్లవద్దని సూచించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున పశువుల కాపరులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వైద్యాధికారులు ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో చెత్త నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

పని ఒకరిది.. బిల్లు మరొకరికి!

- ఇదీ అధికారుల నిర్వాకం

పొందూరు: వైసీపీ ప్రభుత్వంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. గత ప్రభుత్వంలో నాయకులు, ప్రజాప్రతినిధులు చెప్పినదే వేదంగా ఇష్టారీతిన వ్యవహరించారు. పెనుబర్తి పంచాయతీ, అల్మాజీపేట రోడ్డు పనికి చెల్లించిన బిల్లులే దీనికి ఉదాహరణ. అల్మాజీపేటలో 2019లో టీడీపీ ప్రభుత్వంలో బాడాన గిరి రోడ్డు పనులు చేయించారు. అదే ఏడాది మార్చిలో దీనికి సంబంధించి మొదటి బిల్లు రూ.4,50,771 గ్రామ పంచాయతీ ఖాతాలో జమయింది. అప్పటికే ప్రభుత్వం మారిపోవడంతో బిల్లు చెల్లించలేదు. కోర్టుకు వెళ్లడంతో కొన్నాళ్ల తరువాత బిల్లులు చెల్లించారు. దీనికి సంబంధించి రెండో బిల్లు సుమారు రూ.3.30 లక్షలు పెండింగ్‌లో ఉంది. 2022లో పంచాయతీ కార్యవర్గం మారడంతో బిల్లు చెల్లించకుండా నిలిపేశారు. నాయకుల ఆదేశాల మేరకు అధికారులు పని చేసిన వారికి బిల్లు చెల్లించకుండా వెండర్ కోడ్‌ను టి.మురళీకృష్ణ పేరుతో మార్చారు. దీనిపై ఇంజనీరింగ్ అధికారులు, మండల అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎంబుక్ చేయడంతో గత ఏడాది జూన్ 12న రెండో బిల్లు రూ.3,24,939 పంచాయతీ ఖాతాలో పడింది. అధికారులు వెండర్‌కోడ్ మార్చడంతో ఈ మొత్తాన్ని పనిచేసిన బాడాన గిరికి బదులు టి. మురళీకృష్ణకు ఇచ్చారు. బిల్లు మురళీకృష్ణకు చెల్లించినట్లు ఇటీవల తేలడంతో శనివారం కూన సత్యారావుతో కలసి ఎంపీడీవోకు గిరి ఫిర్యాదు చేశారు. అధికారుల నిర్వాకంపైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, వేరే వాళ్లకు చెల్లించిన మొత్తాన్ని వెంటనే తిరిగి ఇవ్వకపోతే బాధ్యులైన అధికారులందరినీ కోర్టుకు లాగుతామని గిరి హెచ్చరించారు. అధికారులు పొరపాటు జరిగిందని అంగీకరిస్తూనే నెపాన్ని ఒకరిపై ఒకరు నెట్టుకోవడం గమనార్హం.

మృతుని కుటుంబాన్ని ఆదుకుంటాం

పొందూరు: అచ్యుతాపురం ఫార్మా కంపెనీ ప్రమాదంలో మృతిచెందిన ఉద్యోగి హంస ప్రశాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే రవికుమార్ భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలోని ప్రశాంత్ కుటుంబాన్ని ఆయన శనివారం పరామర్శించారు. ప్రశాంత్ భార్య జ్యోతి, తల్లి సత్యవతి, సోదరుడు బాబీని ఓదార్చారు. సీఎం ఆదేశాలతో ప్రమాదం జరిగిన 24 గంటలలోనే బాధిత కుటుంబానికి రూ.కోటి చెక్కు అందించారన్నారు. సంస్థ నుంచి రావాల్సిన ఇతర ప్రయోజనాలను త్వరలోనే అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. రవికుమార్‌తో పాటు నాయకులు ఉన్నారు.

సీఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైం: విశాఖ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న 26 మంది సీఐలకు బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు స్టేషనులో సీఐగా విధులు నిర్వహిస్తున్న చొల్లంగి వెంకటరావుకు విశాఖపట్నం-4టౌన్ పోలీసు స్టేషనుకు, డీటీసీ సీఐ జి.నిర్మలకు విశాఖ జోన్-1 మహిళా పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యింది. వీరి స్థానాల్లో సీఐలను నియమించాల్సి ఉంది.

హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం

ఎచ్చెర్ల: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మెగా డీఎస్సీకి సంబంధించి ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఇబ్రహీంబాద్ గ్రామంలో మాజీ సైనికులు నిర్మించిన గ్రంథాలయంలో శ్రీకాకుళం బ్రహ్మర్షి సంస్థ సరఫరా చేసి డీఎస్సీ స్టడీ మెటీరియల్‌ను అభ్యర్థులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ఇటీవల జాబ్‌మేళాలు నిర్వహించి 550 మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణ మూర్తి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, మాజీ సర్పంచ్ వావిలపల్లి రామస్వామి, విశ్రాంత ప్రిన్సిపాల్ వి.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ హాస్టళ్లలో సౌకర్యాలు: వీసీ

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించినట్టు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. హాస్టళ్లను శనివారం ఆమె సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, నాణ్యమైన భోజనం, బాత్‌రూమ్‌ల ఆధునీకరణ, కొత్త మంచాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎస్.లోకేశ్వరి, డిప్యూటీ వార్డెన్లు చిన సుబ్బారావు, విజు తదితరులు పాల్గొన్నారు.

పకీరుపేట రోడ్డు పనులు ఎందుకు చేయరు?

- అధికారులను నిలదీసిన వైస్ చైర్‌పర్సన్ భారతీదివ్య
- వాడీవేడిగా మున్సిపల్ సమావేశం


చైర్‌పర్సన్‌తో వైస్‌చైర్‌పర్సన్ భారతి దివ్య వాగ్వాదం


ఇచ్ఛాపురం: స్థానిక 16వ వార్డు పకీరుపేటలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఫిబ్రవరిలో టెండర్లు పూర్తయితే ఇంతవరకు ఎందుకు ప్రారంభించలేదని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌ను నిలదీశారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే అశోక్ శుక్రవారం పకీరుపేటలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేయాల్సి ఉండగా... ఎందుకు వాయిదా వేశారో సమాధానం చెప్పాలని వైస్ చైర్‌పర్సన్ భారతి దివ్య కమిషనర్‌ను నిలదీశారు. 'వార్డు ప్రజల ముందు నన్ను అవమానిస్తారా?' అని నిలదీశారు. ఎమ్మెల్యే చెప్పడంతో వాయిదా వేశారని చైర్‌పర్సన్ సమాధానం చెప్పటంతో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల వ్యక్తిగత దూషణలకు దారితీసింది. దీంతో కౌన్సిల్ హాల్ గందరగోళంగా మారింది. మూడేళ్లుగా రోడ్డు కోసం పోరాడుతుంటే ఇప్పటికి మోక్షం కలిగిందని... రాజకీయ కక్షతో పనులు నిలిపి వేయటం దారుణమని వైస్‌చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాభాల స్వర్ణమణి అధికారులను నిలదీశారు. త్వరలోనే పనులు చేపడతామని చైర్‌పర్సన్ చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. అజెండాలో పొందుపరిచిన 10 అంశాలలో 9 అభ్యంతరాల మధ ఆమోదం పొందాయి. ఒక అంశం వాయిదా వేశారు. నామినేషన్ పద్ధతిలో పనులు చేయటంపై వైస్ చైర్‌పర్సన్ స్వర్ణమణి అభ్యంతరం వ్యక్త చేస్తూ డీసెంట్ నోటీసు అందించారు. సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ ఆశి లీలారాణి, కమిషనర్ ఎన్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం తగదు..

మున్సిపల్ కార్యాలయంలో మరుగుదొడ్లు బాగు చేయటానికి, గేట్లు ఏర్పాటుకు రూ.లక్షల్లో ప్రజాధనం వృథా చేస్తారా? అని మున్సిల్ వైస్‌చైర్‌పర్సన్లు లాబాల స్వర్ణమణి, ఉలాల భారతి దివ్య అధికారులను ప్రశ్నించారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరిచిన 3అంశాలపై చర్చ జరగ్గా రెండు వాయిదా పడ్డాయి. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ నియామకానికి ఇచ్ఛాపురం బార్ అసోసియేషన్ నుంచి 5 దరఖాస్తులు మున్సిపల్ కౌన్సిల్‌కు వచ్చాయి. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎం.దాంబాబుకు మెజార్టీ కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో పాడైన మరుగుదొడ్లకు రూ11.50 లక్షలకు కౌన్సిల్ ఆమోదం కోరగా వైస్‌చైర్‌పర్సన్లు స్వర్ణమణి, భారతి దివ్య అధికారులను నిలదీశారు. మున్సిపల్ కార్యాలయం ప్రవేశమార్గంలో 2గేట్లు ఏర్పాటు చేయటానికి రూ.14.50లక్షలతో ఆమోదం కోరగా దీన్ని కూడా వైస్‌చైర్‌పర్సన్లు అడ్డుపడ్డారు. ప్రజల ధనం దుర్వినియోగం చేస్తే ఒప్పుకోమని కౌన్సిల్ సభ్యులు తెలిపారు. దీంతో ఈ రెండు అంశాలు వాయిదా వేశారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వైస్‌చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాబాల స్వర్ణమణి, అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

బిడ్డ మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోండి

- ఎస్పీని కోరిన మృతుని కుటుంబ సభ్యులు



విలేకరులతో మాట్లాడుతున్న మృతుని కుటుంబసభ్యులు

శ్రీకాకుళం క్రైం: రణస్థలం మండలం సీతవలస గ్రామానికి చెందిన ధర్మాన ఈశ్వరరావు చిన్న కుమారుడు రమేష్‌ను పథకం ప్రకారం వేధించి... అతని మృతికి కారణమైన వారిపై తక్షణ చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మృతుని కుటుంబ సభ్యులు శనివారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని కోరారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మృతుని తండ్రి ఈశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ జూలై 27న ఉదయం 7 గంటలకు తమ కుమారుడు రమేష్ (23) విధులు నిర్వహించేందుకు ఇంటి నుంచి వెళ్లాడని, అతడిని లావేటి గోపి అనే వ్యక్తి పనిచేస్తున్న స్థలం నుంచి తీసుకువెళ్లి కేశవరాయునిపాలెం గ్రామంలో ఓ గొడవలో ఇరికించాడని తెలిపారు. వారితో కొట్టించడంతో తన కొడుకు అవమాన భారంతో ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. దీనిపై అనుమానాలు ఉన్నాయని... ఆత్మహత్యకు పాల్పడిన ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిజాలు తేల్చి దోషులను శిక్షించాలని వారు ఎస్పీని కోరారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ డీఎస్పీ స్థాయి అధికారితో విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బాధితుల సమక్షంలోనే రణస్థలం ఎస్ఐ చిరంజీవికి ఫోన్ చేసి..పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు. ఎస్పీని కలిసిన వారిలో మృతుని కుటుంబసభ్యులు నరేష్, వెంకటరావు, గొల్లబాబు ఉన్నారు.

మీరు తొలగిస్తారా.. తొలగించమంటారా?

సరుబుజ్జిలి: ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను సెప్టెంబర్ 2లోగా తొలగించకపోతే ప్రభుత్వ యంత్రాంగం స్వయంగా తొలగిస్తారని తహసీల్దార్ ఎల్.మధుసూదన స్పష్టం చేశారు. అలికాం-బత్తిలి, జేఎస్ రోడ్ల పక్కన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా కట్టడాల తొలగింపునకు సంబంధించి 131 మందికి ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ జేఈ ఆంజనేయనాయక్, ఆర్ఐ బాబూరావు, విఆర్‌వో సుజాత పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

సోంపేట: వినాయక చవితి నాడు మట్టి విగ్రహాలకే పూజించాలని జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి తెలిపారు. గొనకపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకృష్ణ, సింహాచలం, మీనకేతనరావు తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం

కంచిలి: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ కంచిలి మండల శాఖ అధ్యక్షునిగా గూంద్ర జగ్గారావు శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారునిగా మల్రిపాటి జోగారావు, గౌరవ అధ్యక్షునిగా మాస్టీల మన్మథరావు, ఉపాధ్యక్షునిగా కొక్కిలి రాజు, ప్రధాన కార్యదర్శిగా దడ్డ మోహన్‌రావు, ట్రెజరర్‌గా ఉదయపురం రవి, కార్యదర్శిగా బడియా చంద్రయ్య ఎన్నికయ్యారు.

శ్రీకాకుళం వన్‌టౌన్ ఎస్ఐకి బదిలీ

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం వన్‌టౌన్ ఎస్ఐ కె.కామేశ్వరరావును అనకాపల్లికి బదిలీ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

తీరప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలి

కవిటి: కవిటి మండలంలోని తీరప్రాంతవాసులు రానున్న రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు మురళీ మోహనరావు సూచించారు. శనివారం తీరప్రాంత గ్రామాల్లో ఎస్ఐ రాము, సిబ్బందితో కలసి పర్యటించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని ఆదేశించారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

పొందూరు: ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. సంఘ నాయకులు శనివారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల యూటీఎఫ్ అధ్యక్షులు జి.గోపాలరావు, నాయకులు మధుబాబు, మురళి, సత్యనారాయణ, మెట్ట భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి..

లావేరు: ఉపాధ్యాయ, ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న సీపీఎస్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని ఏపీటీఎఫ్ లావేరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జగదీశ్వరరావు, పైడి నాగభూషణరావులు డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీ కోసం కమిటీని నియమించాలని, ఈలోగా మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు.

ఇచ్ఛాపురం: సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వీ అనంతాచార్యులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా ఏపీటీఎఫ్ బృందం ఇచ్ఛాపురంలో గల ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలను వినతుల రూపంలో సేకరించారు. 2004 సెప్టెంబరు 1న సీపీఎస్‌ను అమలు చేశారని .. ఆదివారం విద్రోహ దినంగా పాటిస్తూ శ్రీకాకుళం కలెక్టర్ వద్ద నల్ల బాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకర్, జి.ఉమాశంకర్, కె.సత్తమయ్య, బృందావన్ బెహరా, ధర్మరాజు, రాజు, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

చేనేత అభివృద్ధికి కృషి

పొందూరు: చేనేత కార్మికుల సంక్షేమానికి, అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో కట్టుబడి ఉన్నారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. స్థానిక లావేటి వీధిలో ఖాదీ నేత కార్మికులతో మాట్లాడారు. గిట్టుబాటు ధర వస్తోందా? లేదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో తొలగించిన చేనేత కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. పొందూరు ఖాదీ, చేనేత రంగాన్ని ఆదుకుంటామన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


మొక్కలు నాటుతున్న పేడాడ

ఆమదాలవలస: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినోత్సవాల్లో భాగంగా శనివారం వన మహోత్సవం నిర్వహించారు. పాలపోలమ్మ గుడి దగ్గర రోడ్డుకు ఇరువైపులా జనసేన శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మజ్జి రాబాబు, శిర్లాపు గణేష్, గంగు కోటేష్, మాకేన సతీష్, తుంగాన తవిటినాయుడు, దుల్ల సతీష్, వాసునాయుడు, చింతాడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ రంగంలో యువతకు శిక్షణ

పొందూరు: ఖాదీ పరిశ్రమ పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే యువతకు ఆధునిక శిక్షణ అవసరమని లీడర్ పీపుల్స్ సంస్థ నిర్వాహకులు వి.వి. రమణమూర్తి అన్నారు. చేనేత కార్మిక కుటుంబాలలోని 25మంది యువతీ యువకులకు ఆధునిక శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9490528730 నెంబరును సంప్రదించాలని కోరారు.

ముగిసిన జాతీయ సెమినార్

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంటు విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సెమినార్ శనివారంతో ముగిసింది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంటు అనే అంశంలో వ్యూహాలు, సవాళ్లు అనే విషయంపై సెమినార్ జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి అధ్యాపకులు, వక్తలు పరిశోధనా అంశాలపై పేపర్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ, సెమినార్ కన్వీనర్ కె.అచ్యుతరావు, కో కన్వీనర్ డి.చక్రపాణి, అధ్యాపకులు ఎస్.సంతోష్ రంగనాథ్, కె.ఉదయకిరణ్, టి.భవాని తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం: పోలీసు శాఖలో పని చేస్తున్న వారితో పాటు, ఉద్యోగ విరమణ చేసిన సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఉద్యోగంలో ఉంటూ మరణించిన పోలీసు, హోమ్ గార్డుల కుటుంబ సభ్యులతో ఎస్పీ సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. 19 మంది కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలతో పాటు వ్యక్తిగతమైన సమస్యలు తెలుసుకున్నారు. వీటిని పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశించారు. ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, సహాయ పరిపాలనాధికారిణి జి.శోభారాణి, ఆర్.ఎస్.ఐ.లు వెంకటరమణ, హరినారాయణ, పోలీసు అసోసియేషన్ రాష్ట్రసహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాధికారికి పురస్కారం

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయాధికారి మురపాక శ్రీని వాసరావుకు రవీంద్రరత్న పురస్కారం లభించింది. కర్ణాటక లోని మెయిల్ ఫౌండేషన్ వారు ఈ పురస్కారాన్ని ప్రకటించారు. సంస్థ చైర్మన్ జాన్ థామస్, కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్ వర్చువల్ విధానంలో పురస్కారాన్ని ప్రదానం చేశారు.

సంచార జాతుల విముక్త దివస్

శ్రీకాకుళం కల్చరల్: సంచార జాతుల విముక్త దివస్‌ను శనివారం బీజేపీ ఓబీసీ మోర్చా సంచార జాతుల విభాగం రాష్ట్ర కో కన్వీనర్ పి.సురేష్ బాబు సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యులు పి.సూర్యకుమారి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.సంజీవిరావు, జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా సంచార జాతుల విభాగం కార్యవర్గ సభ్యులు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఉన్న 40 సంచార జాతుల కుటుంబ సభ్యులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

ఇచ్ఛాపురం: బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని తహసీల్దారు వెంకటరావు సూచించారు. శనివారం డొంకూరు, బూర్జపాడు, చిన్న, పెద్ద లక్ష్మీపురం, శివకృష్ణాపురం గ్రామాలను సందర్శించారు. అనంతరం డొంకూరులో మత్స్యకారులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. మత్స్యకార గ్రామాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలిపారు.

జెమ్స్ ఆసుపత్రిలో పింఛను పంపిణీ

కంచిలి: కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం గ్రామానికి చెందిన దూగాన రమణమూర్తి అనారోగ్యం కారణంగా శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం వీఆర్‌ఓ బి.శ్రీనివాసరావు, మాదిన ప్రదీప్‌లు ఆస్పత్రికి వెళ్లి... బాధితుడికి పింఛను అందజేశారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై దృష్టి

రణస్థలం: బీజేపీ సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని కార్యకర్తలకు, నాయకులకు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సూచించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మండల పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి మోదీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లంక అప్పలనాయుడు, ఇజ్జాడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పశువుల తరలింపు


శ్రీకాకుళం అర్బన్: నగరంలోని రోడ్లపై తిరుగుతున్న పశువులను నగర పాలక కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశాల మేరకు ప్రజారోగ్యాధికారి డాక్టర్ పి.సుధీర్ కుమార్ అరసవల్లిలోని పశువుల దొడ్డికి తరలించారు. శనివారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 8 పశువులను తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ వారం రోజుల పాటు నిర్వహిస్తామన్నారు.

మహిళలకు శుభ్రతపై అవగాహన

గుజరాతీపేట: స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో మహిళలకు రుతుక్రమంలో శుభ్రతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొల్లినేని మెడిస్కిల్స్ పారా మెడికల్ విద్యార్థులు, ప్రిన్సిపాల్ డా.సూర్యచం ద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, రుద్రమణి రాణి, మెడిస్కిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం స్ఫూర్తిదాయకం

- మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి


రక్తదానం చేస్తున్న దృశ్యం

అరసవల్లి: జిల్లాలో విషజ్వరాలు, డెంగ్యూ, మలేరియా భారిన పడి, రక్తం కొరతతో అవస్థలు పడుతున్న తరుణంలో ఇంజరాపు మోహన్ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. శనివారం స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో 20 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత పాల్గొన్నారు.

పాత్రఖండలో పొలంబడి

సోంపేట: పాత్రఖండ గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో బి.నరసింహమూర్తి మాట్లాడుతూ క్షేత్ర ప్రయోగాల్లో భాగంగా ఆకుల కత్తిరింపు విధానాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల ప్రతినిధి కుమారి, వ్యవసాయ సహాయకులు ఉష, రైతులు బురద విశ్వనాథం, జగన్నాయకులు, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.